సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ◆ 9 ◆ ఫిబ్రవరి ◆ 2025



కొత్త సొసైటీలకు కసరత్తు

జిల్లాలో ప్రస్తుతం 21 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా కొత్తగా మరో 35 సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. 8లో



ఆన్‌లైన్ వస్తే మరింత మేలు

ఇల్లెందులో అత్యాధునిక వసతులతో నిర్మించిన గ్రంథాలయంలో డిజిటల్ సేవలు అందుబాటులోకి తేవాలని పాఠకులు కోరుతున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 20°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం మాత్రం కొంతమేర చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఎస్పీ రోహిత్

కొత్తగూడెంఅర్బన్ : క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ – 2025 ముగింపు వేడుకలు శనివారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా జరిగాయి. క్రీడోత్సవాల్లో అన్ని విభాగాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొనగా, వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని క్రీడాసక్తి ప్రదర్శించారని, వయసుతో సంబంధం లేకుండా కొందరు ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమని అన్నారు. క్రీడల్లోనే కాకుండా జీవితంలోనూ ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆదివాసీ యువతికి జాతీయ స్థాయిలో రజత పతకం



రజత పతకంతో హర్షప్రద

గుండాల : జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఆదివాసీ యువతి పాయం హర్షప్రద రజత పతకం సాధించింది. ఆళ్లపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన హర్షప్రద డెహ్రాడూన్‌లో జరిగిన 38వ జాతీయ తైక్వాండో 73 కేజీల క్యోరుగి విభాగంలో తెలంగాణ తరపున ఫైనల్స్‌కు ఎంపికైంది. అద్భుత ప్రతిభ కనబర్చి రజత పతకం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా హర్షప్రదను పలువురు అభినందించారు.

100 రోజులు.. నిరంతర విద్యుదుత్పత్తి



కేక్ కటింగ్ వేడుకలో ఇంజనీర్లు, సిబ్బంది

పాల్వంచ: సూపర్ క్రిటికల్ టెక్నాలజీ 800 మెగావాట్ల సామర్థ్యం గల కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో రికార్డ్ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించారు. గతేడాది అక్టోబర్ 29 నుంచి ఈనెల 8 వరకు నిరంతరాయంగా 100 రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తి సాధించగా, సీఈ శ్రీనివాస బాబు శనివారం కర్మాగారంలో కేక్ కట్ చేశారు. ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితో ఇది సాధ్యమైందని, ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంతో నాణ్యమైన విద్యుదుత్పత్తి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ యుగపతి, గడ్డం శ్రీనివాసరావు, యాస్మిన్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'నవోదయ' ప్రవేశపరీక్ష

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో వచ్చే విద్యాసంవత్సరం 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పాలేరులోని నవోదయ విద్యాలయలో 9వ తరగతికి, కూసుమంచిలోని ఉన్నత పాఠశాల, ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీ, రిక్కాబజార్, శాంతి నగర్ ఉన్నత పాఠశాలల్లో 11వ తరగతిలో ప్రవేశాలకు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9వ తరగతిలో ప్రవేశానికి 753 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 544 మంది, 11వ తరగతిలో 1,384 మందికి గాను 1,182 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలోని పలు కేంద్రాలను ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ, కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీ, నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

భద్రాద్రిలో ఆధ్యాత్మిక శోభ..



రామాలయంలో జీయర్‌స్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

- వైభవంగా విష్ణుసహస్ర నామ పారాయణం
- సామూహిక స్తోత్ర పారాయణం చేయించిన జీయర్ స్వామి
- భారీగా హాజరైన భక్తులు

భద్రాచలంటౌన్: విరాట్ విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణ మహోత్సవంతో భద్రాచలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తుల 'జై శ్రీరామ్.. జై శ్రీమన్నారాయణ' నామస్మరణలతో భద్రగిరి మార్మోగింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి సారథ్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్థానిక జీయర్ మఠం నుంచి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆరాధనా మూర్తులతో కళాశాల మైదానం వరకు శోభాయాత్ర సాగింది. భక్తుల రామనామ సంకీర్తనలు, ఆదివాసీల కొమ్ము నృత్యాలతో కనులపండువగా ప్రదర్శన చేపట్టారు. అనంతరం జీయర్ స్వామి విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ పుస్తకాలను ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేశారు.

రెండు గంటల పాటు పారాయణం..

రాత్రి 7 గంటలకు ప్రారంభమైన విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం రెండు గంటల పాటు వీనులవిందుగా సాగింది. జీయర్ స్వామి భక్తులతో పారాయణం చేయించారు. వేదికపై కొలువుదీర్చిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆరాధనామూర్తులకు మధ్య మధ్య నైవేద్యం, హారతి సమర్పించారు. చివరిగా స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి మాట్లాడుతూ.. విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పాలకులు ప్రజల సంక్షేమంపై దృష్టి సారించాలని, స్వామివారికి భక్తుల సంఖ్య పెరిగి, వారి సంపద కూడా పెరగాలని అన్నారు. విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం చేసిన భీష్ముడికి అనంత బలం చేకూరిందని, అటువంటి పారాయణం చేస్తే భక్తులకు సైతం అంతే శక్తి వస్తుందని చెప్పారు. ప్రజలంతా రామదాసులైతే భగవంతుడు కూడా వారి వెంటే ఉంటాడన్నారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న జీయర్ స్వామి శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, ఈఓ రమాదేవి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విష్ణు సహస్రనామ పారాయణానికి సుమారు ఐదు వేల మంది భక్తులు హాజరు కాగా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 300 మంది వలంటీర్లు సేవలందించారు. సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవనాథ రామానుజ జీయర్ స్వామి, వేద పండితులు మురళీకృష్ణమాచార్యులు, జీయర్ మఠం అధ్యక్షుడు గట్టు వెంకటాచార్యులు, చక్రవర్తి, రాము, రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, కమలకుమారి, సీతామహాలక్ష్మి, అల్లం నాగేశ్వరరావు, నర్సింహారావు, హరిశ్చంద్ర నాయక్, వైద్యులు జయభారతి, సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న జీయర్ స్వామి



హాజరైన భక్తులు



శోభాయాత్రలో ఆదివాసీల కొమ్ము నృత్యం

నిరీక్షణ ఇంకెన్నాళ్లో..

బోనస్ కోసం అన్నదాతల ఎదురుచూపులు

- 60 శాతం మంది రైతులకు అందని బోనస్
- ఇప్పటి వరకు రూ.19 కోట్లు మాత్రమే జమ
- ఇంకా రూ. 25 కోట్ల మేర పెండింగ్



ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు (ఫైల్)

బూర్గంపాడు: యాసంగి వరినాట్లు పూర్తయి నెల కావస్తోంది. రైతులు ఇప్పటికే రెండు విడతలు ఎరువులు చల్లడంతో పాటు కలుపు తీత పనులు చేస్తున్నారు. వానాకాలం సాగు చేసిన సన్నరకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే అసలు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ డబ్బు వస్తే యాసంగి సీజన్ పెట్టుబడికి ఉపయోగపడతాయనే ఆశతో పలువురు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మారు. అయితే బోనస్ డబ్బు ఇప్పటికీ తమ ఖాతాల్లో జమ కాకపోవడంతో పెట్టుబడికి డబ్బు లేక ఆందోళన చెందుతున్నారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు కావస్తుండగా.. బోనస్ డబ్బు తమ చేతికి అందేదెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఈ విషయంలో అధికారులు సైతం ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

అందింది కొందరికే..

ఈ ఏడాది వానాకాలంలో సన్నరకం వరి సాగు చేస్తే రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత నవంబర్‌లో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. రైతులు తాము సాగు చేసిన సన్న, దొడ్డు రకాల ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో విక్రయించారు. అయితే ప్రారంభంలో సన్న రకం ధాన్యం అమ్ముకున్న రైతులకు వారి ఖాతాల్లో బోనస్ జమైంది. డిసెంబర్ మొదటి వారం వరకు ఈ ప్రక్రియ వేగవంతంగా సాగింది. డిసెంబర్ 10 తర్వాత సన్న రకం ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వ మద్దతు ధర మాత్రమే ఐదు, ఆరు రోజుల్లో వారి ఖాతాల్లో జమ అయినా.. క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ మాత్రం ఇప్పటికీ అందలేదు. గత వారం రోజుల క్రితం అతి కొద్ది మంది రైతులకు మాత్రమే బోనస్ జమ కావడం గమనార్హం.

89,143 మెట్రిక్ టన్నులు..

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇందులో 89,143 మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు ప్రభుత్వ మద్దతు ధరల ప్రకారం నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. సన్నరకం ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ విడుదలలో మాత్రం జాప్యం జరుగుతోంది. సన్నరకం ధాన్యం విక్రయించిన రైతుల్లో ఇప్పటి వరకు 7,462 మంది బ్యాంక్ ఖాతాల్లో రూ.19 కోట్ల బోనస్ జమ కాగా, ఇంకా రూ.25 కోట్ల బోనస్ బకాయి ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి బోనస్ డబ్బు అందించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం అమ్మి 50 రోజులైంది



ధాన్యం అమ్మి 50 రోజులైంది. ఇప్పటి వరకు బోనస్ డబ్బులు పడలేదు. ఎప్పుడు పడతాయో కూడా ఎవరూ చెప్పడం లేదు. 100 క్వింటాళ్ల ధాన్యం అమ్మగా రూ. 50వేల బోనస్ రావాలి. ఆ డబ్బు యాసంగి పెట్టుబడికి ఉపయోగపడుతుంది అనుకుంటే రోజురోజుకు ఆలస్యమవుతోంది.

– యేరువ బ్రహ్మారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

200 క్వింటాళ్లకు బోనస్ రావాలి



200 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం అమ్మి 50 రోజులు దాటింది. ఇంతవరకు బోనస్ పడలేదు. అసలు పడతాయో లేదో తెలియటం లేదు. వడ్లు పదిహేను రోజులు ఆరబెట్టి, తూర్పారా పట్టించి ధాన్యం కాంటాలకు హమాలీలకు డబ్బు ఇచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే బోనస్ అతీగతీ లేదు.

– యదమకంటి లింగారెడ్డి, రెడ్డిపాలెం

దశలవారీగా జమ అవుతున్నాయి

సన్నరకం ధాన్యానికి సంబంధించి దశల వారీగా బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ఇప్పటి వరకు రూ.19 కోట్ల మేర బోనస్ రైతులకు అందింది. ఇంకా రూ. 25 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు నగదు జమవుతుంది.

– రుక్మిణీదేవి, డీఎస్ఓ

కొండరెడ్ల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

దమ్మపేట : కొండరెడ్లను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, వారికి మౌలిక వసతులతో పాటు రాయితీతో కూడిన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండలంలోని పూసుకుంటలో శనివారం ఆయన పర్యటించారు. కొండరెడ్ల ఆర్థిక స్థితిగతులు, సమస్యలు, అవసరమైన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ భవనంలో అధికారులు, గ్రామస్తులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి కుటుంబాలుగా జీవిస్తున్న కొండరెడ్లకు డెయిరీ ఫాం, పశువుల పెంపకం, చిన్న తరహా పరిశ్రమలు మంజూరు చేయించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలను పరిష్కరించి పామాయిల్ సాగు చేయించాలని, అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు వంటివి సాగు చేసేలా చూడాలని చెప్పారు. పంటలను ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు రవాణాకు వాహనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. చదువుకున్న యువతకు ఉపాధి కల్పించేలా కంప్యూటర్, మొబైల్ రిపేర్ వంటి రంగాల్లో శిక్షణ ఇప్పించనున్నట్టు చెప్పారు. న్యూట్రిషన్ కిట్లు అందజేసి, వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. పెరటి కోళ్ల పెంపకం, కౌజు పిట్టలు, బాతుల పెంపకానికి ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. గోమూత్రం ద్వారా జీవామృతం తయారుచేసి, పంటల సాగులో ఎరువుగా వినియోగించేందుకు శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఇల్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని, జాబ్ కార్డు ఉన్నవారికి రూ.2లక్షల ప్రమాద బీమా చేయిస్తామని చెప్పారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ.. స్థానికంగా లభించే వెదురుతో పలు రకాల కళాఖండాల తయారీకి అవసరమైన శిక్షణ ఇప్పించేందుకు యువతను కేరళకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజర్ కరుణాకరాచారి పాల్గొన్నారు.



దమ్మపేట : పూసుకుంటలో కొండరెడ్లతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పీఓ రాహుల్



ములకలపల్లి : చేపల చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

అంతర పంటలతో ఆదాయం..

ములకలపల్లి : రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. మండలంలోని పాతూరు గ్రామంలో ఊదర మురళి అనే రైతు చేపట్టిన చేపల చెరువును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ .. చేపల పెంపకం, నాటు కోళ్లు, తేనేటీగల పెంపకం, మునగ సాగు వంటి వాటితో ఆర్థికాభివృద్ధి చెందొచ్చన్నారు. తొలుత మండలకేంద్రంలో మంగపేట పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడొద్దని, సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ గద్దె రేవతి, ఎంపీఓ లక్ష్మయ్య, ఈజీఎస్ ఏపీఓ హుస్సేన్, ఏఈలు సురేశ్, వరప్రసాద్ ఉన్నారు.

సాంకేతికతతో విద్యారంగం అభివృద్ధి

డీఈఓ వెంకటేశ్వరాచారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

కొత్తగూడెంఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థులకు బోధించడం ద్వారా విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లలో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం సాఫ్ట్‌వేర్ వినియోగంపై జిల్లాలోని గణితం, సైన్స్, సోషల్ ఉపాధ్యాయులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో ఈ ప్యానళ్లను ఏర్పాటు చేశామని, వాటిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈనెల 11, 12 తేదీల్లో మండలాల వారీగా ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ సమన్వయకర్తగా వ్యవహరించగా, హైదరాబాద్‌లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు పవన్, నాగేశ్వరరావు, రాజేష్, మోహన్ రావు, నాగరాజు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం సాఫ్ట్‌వేర్ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

11న మోటివేషనల్ సెషన్, గైడెన్స్‌పై అవగాహన

పదో తరగతి విద్యార్థులకు ఈనెల 11న సబ్జెక్ట్ నిపుణులతో మోటివేషనల్ సెషన్, గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా, డైరెక్టర్ నరసింహారెడ్డి హాజరై విద్యార్థులకు సందేశం ఇస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉదయం 10 గంటలకు ఐఎఫ్‌పీ ప్యానల్‌లో టీఎస్ఏటీ చానల్ ఓపెన్ చేసి విద్యార్థులను సిద్ధంగా ఉంచాలని హెచ్ఎంలకు సూచించారు. కార్యక్రమం పూర్తయ్యేవరకు పదో తరగతి విద్యార్థులతో పాటు వారికి బోధించే ఉపాధ్యాయులంతా ఉండాలని, విద్యార్థులు వీక్షించే ఫొటోలను గ్రూప్ లో షేర్ చేయాలని ఆదేశించారు. సెక్రటరీతో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు సీసీటీవీ కెమెరా, స్పీకర్లను ఏర్పాటు చేయాలన్నారు.

13 నుంచి ఎఫ్ఏ మార్కుల పరిశీలన

జిల్లాలో ఫార్మెటివ్ ఎసెస్‌మెంట్ మార్కుల పరిశీలన ఈనెల 13 నుంచి 17 వరకు జరుగుతుందని డీఈఓ తెలిపారు. జిల్లాలో 299 పాఠశాలల పరిశీలనకు 40 టీమ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఒక్కో టీమ్‌కు ఒక ఉపాధ్యాయుడు లీడర్‌గా వ్యవహరించడంతో పాటు ఏడు సబ్జెక్టులకు సంబంధిత టీచర్లు ఉంటారని తెలిపారు. మండల స్థాయిలో ఎంఈఓలు, జిల్లా స్థాయిలో పరీక్షల సహాయాధికారి పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లికి చీర, సారె సమర్పణ



అమ్మవారికి చీర, సారె తీసుకొస్తున్న కొత్వాల



పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శివాలయంలో ఈనెల 10న విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు జరగనున్నాయి. ఈ క్రమంలో పాల పాల్వంచలోని శ్రీ షిరిడీ సాయి బాబా, మైసమ్మతల్లి ఆలయాల నుంచి డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు పెద్దమ్మతల్లి అమ్మవారికి చీర, సారె, చలివిడి తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు పురాణం పవన్‌కుమార్‌శాస్త్రి, దినకరశాస్త్రి, స్థానికులు ముత్యాల కోటేశ్వరరావు, వంగ రమేష్, శరత్, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, బాదర్ల జ్యోషి, మహిపతి రామలింగం, చింత నాగరాజు, గందం నర్సింహారావు, బాలాజీ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజ..

పుష్కర మహాకుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్దమ్మతల్లి ఆలయంలో గణపతి పూజ, పుణ్యావాచనం, మూలమంత్ర మహాం, ప్రతిష్ఠామూర్తుల ఊరేగింపు, పంచామృతాభిషేకం గావించారు. ఆ తర్వాత సామూహిక కుంకుమార్చన, చండీ హోమం జరిపించారు. అనంతరం శ్రీకనకదుర్గ అమ్మవారికి మహిళా భక్తులు చీర, సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఆలయాల్లో సౌకర్యాలు

- దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి

ఖమ్మంగాంధీచౌక్: మహాశివరాత్రి వేడుకలకు హాజరయ్యే భక్తుల కోసం ఆలయాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి సూచించారు. ఖమ్మంలోని కార్యాలయంలో వివిధ ఆలయాల ఈఓలు, అర్చకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ ఈనెల 26న జరిగే మహాశివరాత్రి వేడుకలకు పెద్దసంఖ్యలో భక్తులు కానున్నందున చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయడమే కాక తాగు నీరు, వైద్యసదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే, భద్రత కోసం సీసీ కెమెరాలు అమర్చాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఈ వెంకటేశ్వర్లు, ఈఓలు కొత్తూరు జగన్మోహన్‌రావు, సమత, వీ.వీ.నర్సింహారావు, నలమోతు శేషయ్య, చుండూరు రామకోటేశ్వరరావు, సుదర్శన్, కె.వేణుగోపాలాచార్యులు, హరిచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిన్నెరసానికి కొత్త అతిథి..



డీర్ పార్కులో ఉన్న కొండగొర్రె పిల్ల

పాల్వంచరూరల్: మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లిన గొర్రెల మందలో దారి తప్పిన కొండగొర్రె పిల్ల కూడా కలిసింది. ఏడూళ్ల బయ్యారంలో మేకల కాపరి మండల కలవగా నాలుగు రోజుల క్రితం ఫారెస్ట్ అధికారుల సహకారంతో కిన్నెరసాని డీర్ పార్కుకు తీసుకొచ్చి వదిలేశారు. అప్పటి నుంచి వైల్డ్‌లైఫ్ సిబ్బంది ప్రత్యేక బాక్స్‌లో కొండగొర్రె పిల్లను ఉంచి ఆహారం అందిస్తున్నారు. పర్యాటకులు ఆసక్తిగా గొండగొర్రె పిల్లను వీక్షిస్తున్నారు.

స్నేహభావంతో పోటీపడాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కోరం లక్ష్మి

ఇల్లెందు: క్రీడాకారులు స్నేహభావంతో పోటీపడి సత్తా చాటాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి లక్ష్మి అన్నారు. మినీ స్టేడియం ఆవరణలో ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పరుశురాం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, మాజీ సర్పంచ్ పాయం స్వాతి, నాయకులు మడుగు వెంకటలక్ష్మి, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, పెద్దినేని హరినాథ్‌బాబు, మార్కెట్ రాజు, జాన్సన్, టోర్నమెంట్ నిర్వాహకులు బొల్లి రాజు, శేఖర్, అజయ్, రాకేష్, షఫీ, నందులాల్, మాలోతు రాజేష్, వెంకట్, ఎంపైర్ అమ్ముల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పంటలను సందర్శించిన రైతులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మల్లాయిగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం గ్రామాల్లో నాబార్డు సహకారంతో గిరిజన రైతులు సాగు చేస్తున్న ప్రకృతి పంటలను శనివారం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన రైతులు బీ వీరారెడ్డి, రాజయ్య, కుమార్ స్వామితోపాటు మరో 11 మంది రైతులు సందర్శించారు. వాసన్ సంస్థ పర్యవేక్షణలో స్థానిక రైతులు సాగు చేస్తున్న మునగ, ఆకు కూరలు, పలు రకాల కూరగాయాల పంటలు, వేరుశెనగ పంట, చేపల పెంపకం, పండ్ల మొక్కలతోపాటు అంతర్ పంటగా సాగు చేస్తున్న 24 రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు పంటల సాగు, దిగుబడులు, లాభాలు తదితర అంశాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ సిబ్బంది సతీష్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, చక్రపాణి, శ్రీనివాస్, స్థానిక రైతులు దారా ప్రసాద్, మల్లయ్య పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి పింఛన్ పొందాలి

సింగరేణి(కొత్తగూడెం): జనవరి నెల పింఛన్ పడని సింగరేణి రిటైర్డ్ కార్మికులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి పెన్షన్ పొందాలని కొత్తగూడెం సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన్ ప్రమాన్ పత్రం (లైఫ్‌సర్టిఫికెట్లు) సమర్పించని కారణంగా సీఎంపీఎఫ్ ఆఫీస్ నుంచి పింఛన్ పొందుతున్నవారిలో 1,915 మందికి జనవరి నెల పెన్షన్ మంజూరు కాలేదని ఎస్‌బీఐ అధికారులు తెలిపారని వివరించారు. లైఫ్ సర్టిఫికెట్‌ను పెన్షన్‌రాని వారు cmpf.pension@sbi.co.in కు మెయిల్ చేయాలని లేదా ధనబాద్ ఏరియాలోని ఖతారస్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని కోరారు.

భక్తురాలికి తప్పిన ప్రమాదం



వృద్ధురాలిని ఒడ్డుకు తీసుకొస్తున్న స్థానికులు

భద్రాచలంఅర్బన్: శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు హైదరాబాద్ నుంచి విజయలక్ష్మి అనే వృద్ధురాలు మరికొందరితో కలిసి భద్రాచలం వచ్చింది. శుక్రవారం గోదావరి నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగుతూ జారి నీళ్లలో పడిపోయింది. గమనించిన గజ ఈతగాడు కరుకు ప్రసాద్, స్థానికులతో కలిసి ఆమెను ఒడ్డుకు చేర్చారు. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి కాలు విరిగింది. అనంతరం ఆమెను 108 అంబులెన్సు ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

కొత్త సొసైటీలకు కసరత్తు

- ప్రాథమిక సహకార సంఘాల విస్తరణపై ప్రభుత్వ నజర్
- జిల్లాలో 35 నూతన సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఈ నెల 15తో ముగియనున్న ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం



ఇల్లెందు పీఏసీఎస్ కార్యాలయం వద్ద పాలకవర్గ సభ్యులు (ఫైల్)

ఇల్లెందురూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, సాంకేతిక సామగ్రి విక్రయాలు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు వంటి సేవలందిస్తున్న ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) విస్తరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లాలో చాలావరకు మండలానికి ఒకటి, రెండు చొప్పున పీఏసీఎస్‌లు ఉన్నాయి. క్రమంగా సాగు నీటి వనరులు పెరిగి సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరిగింది. నూతన మండలాలు, గ్రామపంచాయతీలు కూడా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో పీఏసీఎస్‌ల విస్తరణ అనివార్యమైంది.

తక్కువ సంఖ్యలో సిబ్బంది

పీఏసీఎస్‌ల ఆవిర్భావం తర్వాత మళ్లీ కొత్త సంఘాలు ఏర్పాటు చేయలేదు. దీంతో పెరుగుతున్న రైతుల సంఖ్య, సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సేవలు అందించడం సొసైటీలకు శక్తికి మించిన పనిగా మారింది. రైతులకు అందిస్తున్న సేవల ద్వారా వచ్చే లాభంతో సిబ్బందికి వేతనాలు ఇస్తున్నారు. పరిమిత సంఖ్యలో ఉండే సిబ్బంది తక్కువ వేతనంతో సేవలు అందించడం కూడా భారంగా మారింది. ఈ క్రమంలో ప్రాథమిక సహకార సంఘాలు రైతులకు సేవలందించడంలో వెనుకబాటుకు గురవుతున్నాయి.

ప్రతిపాదిత సంఘాలివే

బూర్గంపాడు పీఏసీఎస్ పరిధిలో మోరంపల్లి బంజర, నాగినిపల్లిప్రోలు, చర్ల పీఏసీఎస్ పరిధిలో మొగలపల్లి, నారాయణపురం పీఏసీఎస్ పరిధిలో మామిళ్లవారిగూడెం, సత్యనారాయణపురం పీఏసీఎస్ పరిధిలో కుదునూరు, తేగడ, పాల్వంచ పరిధిలో నాగారం, యానంబైలు, పినపాక పరిధిలో జానంపేట, కరకగూడెం, అశ్వాపురం పరిధిలో మిట్టగూడెం, అమెర్ధ, నెల్లిపాక పరిధిలో తుమ్మల చెరువు, మొండికుంట, దుమ్ముగూడెం పరిధిలో పర్ణశాల, నర్సాపురం, ఇల్లెందు పరిధిలో రొంపేడు, కొత్తగూడెం పరిధిలో లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, మణుగూరు పరిధిలో రామానుజవరం, గుండాల పరిధిలో ఆళ్లపల్లి, బేతంపూడి పరిధిలో బోడు, కోయగూడెం, బొమ్మనపల్లి, గుంపెన పరిధిలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి పరిధిలో జగన్నాథపురం, పొగళ్లపల్లి, పూసుగూడెం, జూలూరుపాడు పరిధిలో పడమటినరసాపురం, కాకర్ల, పాపకొల్లు, దమ్మపేట పీఏసీఎస్ పరిధిలో నాచారం, మొద్దులగూడెం, గండుగులపల్లి గ్రామాలు ఉన్నాయి.

అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే యోచన

కొత్త సొసైటీల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం 2022లో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయగా, క్షేత్రస్థాయి అధికారులు నూతన సంఘాల ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ నాటి సర్కారు ప్రతిపాదనలను విస్మరించడంతో నూతన సంఘాల ఏర్పాటు వాయిదాపడింది. సొసైటీల పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో నూతన సంఘాలు ఏర్పాటు చేసి, అన్నింటికి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని రైతుల సంఖ్య, నూతన మండలాలు, విస్తీర్ణం, రైతుల డిమాండ్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నూతన సంఘాల ఏర్పాటుపై సహకార శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 21 సొసైటీలు ఉండగా, కొత్తగా మరో 35 సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. కాగా సొసైటీ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 15తో ముగియనుండగా, పదవీకాలం పొడిగిస్తారా.. లేక స్థానిక సంస్థల మాదిరిగా ప్రత్యేక అధికారులను నియమిస్తారా అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో నూతన సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరగా, కొత్తగా 35 సొసైటీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సొసైటీల ఏర్పాటు ప్రక్రియ సాగుతుంది.

– ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి

మసీద్ కాంప్లెక్స్ కూల్చివేత

ముస్లిం కమిటీ నిరసన



ఏఈఈ శ్రీనివాసరావును నిలదీస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

అశ్వారావుపేట: పట్టణంలోని రింగ్ సెంటర్‌లో ఉన్న మసీద్ కాంప్లెక్స్ దుకాణాలను డ్రెయినేజీ నిర్మాణం పేరుతో తొలగించారని ముస్లిం కమిటీ సభ్యులు ఆందోళన నిర్వహించారు. అవసరానికి మించి భూసేకరణ చేస్తున్నారని ఆరోపించారు. కొద్ది కాలంగా నిర్మాణదశలో ఉన్న డ్రెయినేజీ పనులు మసీద్ సెంటర్‌కు చేరుకున్నాయి. రహదారి వెడల్పు 100 అడుగులు కాగా, మసీద్ కాంప్లెక్స్ 100 అడుగులకు దూరంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టర్, అధికారులు కలిసి రింగ్‌లో డివైడర్‌ను విస్తరిస్తున్నాంటూ కాంప్లెక్స్ తొలగించాలని చెప్పారు. దీంతో దుకాణాలకు తొలగించారు. శనివారం అశ్వారావుపేటకు వచ్చిన ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు మసీద్ సెంటర్‌లో డివైడర్‌ను విస్తరించడం లేదని, దుకాణాలు తొలగించాల్సిన అవసరం లేదని తెలిపారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న కమిటీ సభ్యులు మసీద్ వద్ద ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, సయ్యద్ సలీం, గోకినపల్లి ప్రభాకర్ తదితరులు ఆందోళనకు మద్దతుగా నిలిచారు. అనంతరం అక్కడకు ఆర్అండ్‌బీ ఏఈఈ రామిశెట్టి శ్రీనివాసరావు రాగా ఆందోళనకారులు నిలదీశారు.

గొల్లగూడెం వాసికి డాక్టరేట్



గొల్లమందల రవి

తల్లాడ: మండలంలోని గొల్లగూడెంనకు చెందిన గొల్ల మందల రవికి డాక్టరేట్ లభించింది. ఏపీలోని సత్యసాయి జిల్లాలో ఉన్న భారతీయ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ద్వారా ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వృక్ష సంపద, వాటి పరిరక్షణ, ఆదివా సీలు ఉపయోగించే ఔషధ మొక్కలపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించిందని రవి తెలిపారు. కాగా, 2020 నుంచి 2025 వరకు చేపట్టిన అధ్యయనంలో 1,131 వృక్ష జాతులను గుర్తించగా తెలంగాణలో ఉమ్మడి వరంగల్ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే అత్యధిక వృక్షజాతులు ఉన్నట్లుగా తేలిందని వెల్లడించారు. తన పరిశోధనలో సహకరించిన డాక్టర్ డి.వీరాంజనేయులు, అసల్ల అప్పయ్య, భరత్‌లాల్ మీనా, డాక్టర్ రూప వాసుదేవన్, డాక్టర్ నాగజ్యోతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యువతి కిడ్నాప్‌నకు యత్నం

ఆటోడ్రైవర్‌కు దేహశుద్ధి

కొత్తగూడెంటౌన్: యువతిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఆటోడ్రైవర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం రాత్రి కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన యువతి ఇంటికి వెళ్లేందుకు కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆటో ఎక్కింది. కొంతదూరం వెళ్లాక ఆటోడ్రైవర్, పట్టణంలోని రాంనగర్‌కు చెందిన గుగులోత్ రవికుమార్ విద్యానగర్ వైపు కాకుండా ఆటోను మరో మార్గంలో మళ్లించాడు. దీంతో యువతి కేకలు వేస్తూ ఆటో నుంచి కిందకు దూకింది. ఆటోటాప్‌పై ఉన్న పేరును గమనించి తన తల్లిదండ్రులు, బంధువులకు విషయాన్ని వివరించింది. దీంతో వారు పట్టణంలో ఆటో కోసం వెతుకులాట చేపట్టారు. ఈ క్రమంలో ఆటోడ్రైవర్ రవికుమార్ తప్పతాగి అండర్ బ్రిడ్జి వద్ద మరో ఆటోను ఢీకొట్టాడు. యువతి బంధువులు ఆటోను గుర్తుపట్టి రవికుమార్‌కు దేహశుద్ధి చేసి కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డబ్బులు ఊరికే రావు..

- లలిత జ్యూయెలరీ మార్ట్ అధినేత కిరణ్‌కుమార్
- ఖమ్మంలో షోరూంను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన జ్యూయెలరీ అధినేత కిరణ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో వైరారోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన లలిత జ్యూయెలరీ మార్ట్‌ను రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యూయెలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 41 ఏళ్లుగా దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా నిలుస్తున్న తమ సంస్థ 60వ షోరూంను ఖమ్మంలో ఏర్పాటు చేసిందని తెలిపారు. బంగారం, వజ్రం, వెండి ఆభరణాల ధరలను ఇతర షోరూంలతో పోల్చుకున్నాకే తమ వద్ద కొనుగోలు చేయాలన్నారు. డబ్బులు ఎవరికీ ఊరికే రావనేది గుర్తుంచుకోవాలని, అధిక తరుగుతో నగలు కొని డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. తమ షోరూంలో తక్కువ తరుగుకే నగలు లభిస్తాయని చెప్పారు. కాగా, తగ్గింపు ధమాకా పేరిట అన్ని ఆభరణాలపై మార్కెట్ కంటే తక్కువ తరుగే కాక ఇంకో శాతం తగ్గింపు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.5 వేల తగ్గింపు, వెండి వస్తువులపై ప్రత్యేక తగ్గింపు ఉందని వెల్లడించారు. అలాగే, తమ షోరూంలో ప్రీ బుకింగ్ స్కీమ్ ఉందని, ఈ పథకంలో చేరిన వారికి 11 నెలల తర్వాత కూడా ఒక శాతం తరుగు లేకుండా నగలు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని కిరణ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, రాజ్యాంగం సాక్షిగా వివాహం



రాజ్యాంగం సాక్షిగా వివాహం చేసుకున్న ప్రశాంత్ - నాగజ్యోతితో స్థానికులు

పెనుబల్లి: అన్నింట్లోకెల్లా రాజ్యాంగం, దాన్ని రచించిన అంబేడ్కరే ముఖ్యమని చెబుతూ యువతీ యువకులు వీటి సాక్షిగా వివాహం చేసుకున్నారు. పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ జార్ఖండ్‌లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసే నాగజ్యోతితో వివాహం నిశ్చయమైంది. అయితే, అంబేడ్కర్ భావజాలం కలిగిన వీరిద్దరూ శనివారం టేకులపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక రాజ్యాంగం సాక్షిగా వివాహం చేసుకున్నారు. ఇందులో కొచ్చర్ల శ్రీనివాసరావు, మీసాల రామచందర్‌రావు వివాహ కర్తలుగా వ్యవహరించారు. మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతొట్టి కాంతయ్యతో పాటు ఇరువురి బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయానే అన్నీ..



కుమార్తెతో ఆయా అవంతిక

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి ఉండగా, కొన్నిచోట్ల టీచర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇలాంటి ఘటనే మండలంలో చోటు చేసుకుంది. కామేపల్లి మండలంలోని రాయిగూడెం-2 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ కమలమ్మ శనివారం విధులకు హాజరుకాలేదు. దీంతో ఆయా అవంతిక కేంద్రాన్ని తెరిచి ఇద్దరు చొప్పున గర్భిణులు, బాలింతలు, తొమ్మిది మంది చిన్నారులకు పౌష్టికాహారం అందించినట్లు రికార్డులో నమోదు చేసింది. అయితే, అవంతిక కుమార్తె మాత్రమే అక్కడ కనిపించగా మిగతా చిన్నారులు ఎక్కడ అని ఆరా తీస్తే నలుగురే వచ్చారని, టీచర్ సూచనలతో అందరికీ హాజరు వేశానని చెప్పడం గమనార్హం. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీఓ దయామణిని వివరణ కోరగా టీచర్ కమలమ్మ అనుమతి లేకుండా గైర్హాజరైనందున చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మావోయిస్టు మిలీషియా సభ్యుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్‌లో మావోయిస్టు మిలీషియా సభ్యుడు వంజం గంగాను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారంతో కొట్టచెరు, భండపదర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో జిల్లా పోలీసులు, 219 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది వెళ్లి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అతను మావోయిస్టు మిలీషియా సభ్యుడు వంజం గంగా అని తేలింది. గంగా 2016లో పోలీసులను హతమార్చేందుకు ఐఈడీలను ఏర్పాటు చేసిన కేసులో ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు.

ఆవు దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

మణుగూరు టౌన్: మండలంలోని అశోక్‌నగర్‌లో రహదారిపై ఆవు దాడి చేసిన సంఘటనలో నిల్చుని ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మణుగూరులో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌కి నర్సింహారావు తన స్నేహితుడితో సాయంత్రం సమయంలో ప్రధాన రహదారి పక్కన మాట్లాడుతున్న క్రమంలో ఒక్కసారిగా దాడి చేసి పొడిచేసింది. దీంతో నర్సింహారావు పొట్ట భాగంలో గాయమైంది. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన క్షతగాత్రుడికి 16 కుట్లు వేసిన వైద్యులు ప్రాణాపాయం నుంచి తప్పించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

- రోడ్డు పక్కన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు
- పలువురు ఘర్షణ పడినట్లు ఆనవాళ్లు



చాట్ల భిక్షం (ఫైల్)

కొణిజర్ల: అనుమానాస్పద స్థితిలో ఓ ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన కొణిజర్ల మండలం గోపవరం సమీపాన శనివారం వెలుగుచూసింది. ఎస్ఐ జి.సూరజ్, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. చింతకాని మండలం నాగిలిగొండకు చెందిన చాట్ల భిక్షం(45) ఆటోడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొణిజర్ల సెంటర్ నుంచి చింతకాని మండలం ప్రొద్దుటూరు వరకు నిత్యం ఆటో నడిపే ఆయన శుక్రవారం రాత్రి 9 గంటల సమయాన ఆటోలో ఇంటికి బయలుదేరినట్లు తెలిసింది. అదే సమయాన భిక్షం పెద్ద కుమారుడు శ్రీరామ్ ఫోన్ చేయగా ఒకరిద్దరు ప్రయాణికులు ఎక్కగానే వస్తానని చెప్పినట్లు సమాచారం. అనంతరం 10 గంటల తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేక పోగా.. శనివారం ఉదయం గోపవరం సమీపాన గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కనే సాగర్ కాల్వకట్టపై భిక్షం మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం పక్కనే ఆటో ఉండగా గోపవరానికి చెందిన అద్దంకి చిరంజీవి, మంగా చెన్నారావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చేరుకుని పరిశీలించగా మృతదేహంపై దెబ్బలు ఉండటం, హైవే పక్కనే మట్టి దిబ్బలపై మద్యం సీసాలు, పెనుగులాడినట్లు గుర్తులు ఉండటంతో భిక్షం సహా పలువురు మద్యం సేవించి ఉంటారని, ఆ తర్వాత ఏదో కారణంతో ఘర్షణ జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు ఆయన మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయన్న కుటుంబీకుల ఫిర్యాదుతో వైరా ఏసీపీ ఎంఏ రహమాన్, సీఐ సాగర్‌నాయక్, కొణిజర్ల, చింతకాని ఎస్ఐలు సాగర్, నాగుల్‌మీరా పరిశీలించి వివరాలు ఆరా తీశారు. మృతుడు గత నెల వరకు ఆటో అడ్డా అధ్యక్షుడిగా పనిచేయగా ఆయనకు భార్య సుజాత, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..

ములకలపల్లి: విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సుబ్బనపల్లిలో గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సుబ్బనపల్లికి చెందిన బండి వెంకటమ్మ (45)కు భర్త చనిపోగా కుమారుడు రాకేశ్‌తో కలిసి జీవనం సాగిస్తోంది. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న కుమారుడు డ్యూటీ నిమిత్తం వెళ్లగా శుక్రవారం వెంకటమ్మ ఒక్కతే ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి వేళ ఇంట్లోని విద్యుత్‌వైరు తెగి ఆమెపై పడటంతో విద్యుదాఘాతంతో మృతిచెందింది. ప్రమాదంలో మంటలు వ్యాపించడంతో వెంకటమ్మ శరీరం కాలిపోయింది. శనివారం ఉదయం ఇరుగుపొరుగు వారు ఇచ్చిన సమాచారంతో వచ్చిన 108 సిబ్బంది.. అప్పటికే ఆమె మృతి చెందిందని తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు.

పాల్వంచలో దొంగల హల్‌చల్



కాలనీలో అర్ధరాత్రి సంచరిస్తున్న దుండగుడు

పాల్వంచ: పట్టణంలో కొంతకాలంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల నవభారత్ కాలనీలో పలు క్వార్టర్లలో అధికారుల ఇళ్లలో చోరీలకు పాల్పడి భారీగా నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. గత గురువారం అర్ధరాత్రి కాంట్రాక్టర్స్ కాలనీలో తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి చోరీకి యత్నించారు. ఎలాంటి సొత్తు లేక పోవడంతో వెనుతిరిగారు. దొంగలు స్వైర విహారం చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలు బస్సుఎక్కే క్రమంలో హ్యాండ్‌బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బ్యాగ్‌లో రూ.5వేలు నగదు, చెవిదిద్దులు ఉన్నాయని సమాచారం.

సిద్ధార్థుడి జీవితం ఆదర్శనీయం

- కొనియాడిన దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు



బుద్ధవనంలోని ధర్మగంట వద్ద బౌద్ధులు

నాగార్జునసాగర్: సిద్ధార్థుడి (బుద్ధుడి) జీవితం ఆదర్శనీయమని దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు కొనియాడారు. నాగార్జునసాగర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ త్రిపీటక పఠనోత్సవంలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు శనివారం బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి శిల్పం, బుద్ధుడి పాదుకలు, బుద్ధ చరితవనం, శ్రీలంక బహూకరించిన అవుకన బుద్ధుడి శిల్పం, స్తూపవనంలోని 14 నమూనా స్తూపాలను సందర్శించారు. బుద్ధవనం కన్సల్టెంట్, చరిత్ర పరిశోధకుడు, బౌద్ధనిపుణుడు శివనాగిరెడ్డి వారికి బుద్ధవనంలోని శిల్పాల విశేషాలను, చారిత్రక ప్రాధాన్యాలను వివరించారు. శ్రీలంక ప్రభుత్వం బహూకరించిన గంటను మోగించి బుద్ధవనం పర్యటనను ముగించారు. అక్కడినుంచి లాంచీలో వెళ్లి నాగార్జునకొండను సందర్శించారు. అక్కడి కట్టడాలు, శిల్పాలను ఆసక్తిగా వీక్షించారు. బౌద్ధ ప్రదర్శనశాల విశేషాలను మ్యూజియం అధికారి కమల్‌హాసన్ వివరించారు. కార్యక్రమంలో మహాబోధి బుద్ధవిహార అధ్యక్షుడు కశ్యపబంతే, ఆనంద బంతే, సంఘపాల బంతే, శ్రీలంక మయన్మార్, లావోస్, కంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాల బౌద్ధ భిక్షువులు అంతర్జాతీయ త్రిపీటక పఠన మండలి వ్యవస్థాపకురాలు వాంగ్మోడీక్షి(అమెరికా), సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే 268 మంది మందుబాబులు చిక్కారు!

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మందుబాబుల మత్తు వదిలిస్తున్నారు. ఈ నెల 7న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) తనిఖీల్లో 268 మంది పట్టుబడ్డారు. వీరిలో 223 మంది ద్విచక్ర వాహనదారులు కాగా.. 10 మంది త్రీ వీలర్స్, 33 మంది ఫోర్ వీలర్స్, ఇద్దరు ట్రక్ డ్రైవర్లు ఉన్నారు. ఆయా వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో 35 మంది మత్తుబాబుల బీఏసీ మోతాదు 200 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్‌గా నమోదయింది. మద్యం మత్తులో వాహనాలను నడిపే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేశారు.



పొట్టచేత 'బట్టి'..

జానెడు పొట్ట కోసం ఇటుక బట్టీల్లో మహిళా కార్మికులు మోయలేని భారంతో పనులు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా బ్రిక్స్ వ్యాపారానికి ప్రసిద్ధి. జిల్లా వ్యాప్తంగా 90 వరకు ఉన్న ఇటుక బట్టీల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మంది వలస కూలీలు ఉపాధి పొందుతున్నారు. పెద్దపల్లి శివారులో మహిళలు తలపై ఇటుకలు మోస్తూ ఇలా కనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఎటుచూసినా ఎర్ర బంగారం

మహబూబాబాద్ జిల్లా మిర్చి అంటే జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉంది. అలాంటిది.. మిర్చి ధరలు సగానికి సగం పడిపోవడంతో.. మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం చింతపల్లి, పెద్ద లాలు తండా, చిన్న లాలు తండా గ్రామాల పైనుండి వెళ్తున్న జాతీయ రహదారి–365 పై.. రైతులు కిలోమీటర్ల మేర మిర్చిని ఎండబోసారు. మధ్యాహ్న సమయంలో మిర్చిని ఎండబెట్టి.. సాయంత్రం కాగానే వాటిని కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

చొరబాటు ప్రయాణం!

మయన్మార్ టు ఇండియా వయా బంగ్లాదేశ్

- నగరానికి రోహింగ్యాల రాక సాగుతోందిలా..
- అత్యధికంగా పాతబస్తీలో స్థిరపడుతున్న వైనం
- మీ సేవ సెంటర్ల నిర్వాహకులతో గుర్తింపు పత్రాలు
- కోల్‌కతాలో చిక్కినవారి విచారణలో వెలుగులోకి
- బంగ్లా పరిణామాల నేపథ్యంలో నిఘా వర్గాల అలర్ట్

సాక్షి, హైదరాబాద్: మయన్మార్ నుంచి అక్రమ మార్గంలో భారత్‌లోకి చొరబడుతున్న రోహింగ్యాల్లో అనేక మంది నగరంలోనూ ఉంటున్నారా? అనే ప్రశ్నకు ఔననే అంటున్నాయి నిఘా వర్గాలు. వీరిలో అత్యధికులు హైదరాబాద్‌లోని పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో స్థిరపడుతున్నట్లు చెబుతున్నాయి. కోల్‌కతాలోని సాంత్రాగచ్చి రైల్వే స్టేషన్‌లో అక్కడి రైల్వే పోలీసులు బుధవారం నలుగురు రోహింగ్యాలను పట్టుకున్నారు. వీళ్లు ఏళ్ల క్రితం అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చి నగరంలోని పాతబస్తీలో ఉంటున్నారని, తిరిగి బంగ్లాదేశ్ వెళ్లే ప్రయత్నాల్లో అక్కడి పోలీసులకు చిక్కారు. వీరి విచారణలో మయన్మార్ నుంచి భారత్ వరకు సాగుతున్న రోహింగ్యాల 'ప్రయాణం' వెలుగులోకి వచ్చింది.

అక్కడి అలజడులతో ఇక్కడ దడ...

బంగ్లాదేశ్‌తో పాటు మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత పరిస్థితులపై ఈ అక్రమ వలసదారుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఆయా దేశాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తిన ప్రతిసారీ.. అనేక మంది రోహింగ్యాలు వాటిని విడిచిపెడుతున్నారు. వీరిలో అత్యధికులు నేరుగా భారత్‌కు వలస వస్తున్నారు. నగరంలోని పాతబస్తీతో పాటు శివార్లలో స్థిరపడుతున్నారు. తాజాగా మరోసారి బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చెలరేగడంతో అక్రమ వలసలు పెరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

మాంగ్డో నుంచి టెక్నాఫ్ నగరానికి..

మయన్మార్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన రోహింగ్యాలు అడవుల వెంట కాలిబాటన నడుస్తూ ఆ దేశంలోని మాంగ్డో అనే ప్రాంతానికి చేరుకుంటున్నారు. రాత్రి వేళల్లో చిన్న చిన్న పడవలపై నఫ్ నదిని దాటుతున్న రోహింగ్యాలను బంగ్లాదేశ్‌లో ఉన్న దళారులు రిసీవ్ చేసుకుని, భద్రత బలగాల కంట పడకుండా టెక్నాఫ్ అనే నగరానికి తీసుకువెళ్తున్నారు. అక్కడి నుంచి బస్సుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద రోహింగ్యాల శరణార్థి శిబిరం ఉన్న కాక్స్ బజార్‌కు వీళ్లు వచ్చి చేరుతున్నారు. అక్కడ ఉండగానే అనేక మంది ఐక్యరాజ్య సమితి శరణార్థి కార్డు పొందుతున్నారు. అక్కడ శరణార్థి శిబిరంలో కొన్నాళ్లు తలదాచుకుని బంగ్లాదేశ్ రాజధాని ఢాకా చేరుకుని అక్కడి నుంచి ఇండో–బంగ్లా సరిహద్దుల్లోని భోమ్రా ప్రాంతానికి బస్సుల్లో వస్తున్నారు. భద్రతా బలగాల కళ్లుగప్పి ఇచ్ఛామతి నది దాటి భారత్‌లోకి ప్రవేశిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా...

కాక్స్ టౌన్‌లో పనులు చేసుకుంటే నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకే సంపాదన ఉంటుందని, అదే హైదరాబాద్ లాంటి నగరాల్లో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నామని సాంత్రాగచ్చిలో చిక్కిన రోహింగ్యాలు మహ్మద్ ఆలం, రియాసుల్ ఇస్లాం, బేగం దిల్‌బార్, రబీల్ ఇస్లాం పశ్చిమ బెంగాల్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. అందుకే నగరానికి అక్రమ వలసదారుల్లో అనేక మంది జీవనోపాధి కోసమే వస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.



సాంత్రాగచ్చిలో చిక్కిన రోహింగ్యాలతో పోలీసులు

పశ్చిమ బెంగాల్ నుంచి అనేక వైపులకు..

ఇలా రెండు దేశాల్లోని నదులు దాటి పశ్చిమ బెంగాల్‌లోని బసిర్హట్ ప్రాంతానికి చేరుకున్న ఈ శరణార్థులు అక్కడ నుంచి హౌరాకు వచ్చి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌తో పాటు బిహార్, జమ్మూ కశ్మీర్‌లకు వెళ్తున్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా తాము పశ్చిమ బెంగాల్ వాసులమంటూ ఇంటిని అద్దెకు తీసుకుంటున్నారు. అద్దె ఇంటి కరెంట్ బిల్లు ఆధారంగా, వ్యవస్థాగతంగా ఉన్న లోపాలను వాడుకుంటున్న వీళ్లు మీ సేవ కేంద్రాల నిర్వాహకుల సాయంతో ఓటర్ ఐడీలు పొందుతున్నారు. దీని ఆధారంగా ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ ఇలా వరుసగా గుర్తింపు కార్డులు తీసుకుంటున్నారు.

ఆధార్ లింకు ఉంటేనే ఈపీఎఫ్ ప్రోత్సాహకాలు

- ఇప్పటికే పలుమార్లు అవకాశం కల్పించినా అప్‌డేషన్ అంతంతే
- 15వ తేదీలోగా తప్పనిసరిగా లింకు చేసుకోవాలని ఈపీఎఫ్ఓ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)లో కొత్తగా చందాదారులుగా చేరుతున్న వారికి ప్రోత్సాహకాల పంపిణీలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఉద్యోగులుగా కొత్తగా చేరే వారికి కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయీస్ లింక్‌డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (ఈఎల్ఐ) కింద ఒక నెల వేతనం (గరిష్టంగా రూ.15 వేలు) మూడు వాయిదాల్లో అందిస్తుంది. ఇది నేరుగా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి ఈపీఎఫ్ఓ అధికారులు బదిలీ చేస్తారు. ఈ పథకానికి అర్హత సాధించాలంటే సదరు ఉద్యోగి తన పూర్తి వివరాలను సమర్పించి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)ను యాక్టివ్ చేసుకోవాలి. కానీ మెజార్టీ ఉద్యోగులు ఈ ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో ప్రోత్సాహకాల పంపిణీ ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో ఉద్యోగంలో చేరిన మూడు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఈపీఎఫ్ఓ పలుమార్లు సూచించినప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఈ క్రమంలో ఈఎల్ఐ పథకానికి అర్హత సాధించిన వారు ఈనెల 15వ తేదీలోగా యూఏఎన్ యాక్టివేషన్, బ్యాంకు ఖాతాను ఆధార్‌తో సీడింగ్ ప్రక్రియను తప్పకుండా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈమేరకు ఈపీఎఫ్ఓ ప్రధాన కార్యాలయంలోని అదనపు ప్రావిడెంట్ కమిషనర్ అనిల్ టీకే తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈడీఎల్ఐ పథకానికీ లింకు తప్పనిసరి...

ఈపీఎఫ్ఓ చందాదారులకు బీమా పథకంలో భాగంగా ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్‌డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఈడీఎల్ఐ)ను అందిస్తోంది. పీఎఫ్ చందాదారుడైన ప్రతి ఉద్యోగికి ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. వివిధ కారణాలతో ఉద్యోగి మరణిస్తే గరిష్టంగా రూ.7 లక్షల వరకు బీమా డబ్బులు సదరు చందాదారుడి నామినీకి అందుతాయి. ఈ పథకం కింద పలు క్లెయిములు ఆధార్ సీడింగ్ లేకపోవడం, ఉద్యోగికి సంబంధించిన సరైన వివరాలు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి యూఏఎన్ యాక్టివేషన్ పూర్తి చేసుకోవాలని ఈపీఎఫ్ఓ సూచిస్తుంది. అదేవిధంగా ఆధార్ సీడింగ్ ప్రక్రియ సైతం అత్యవసరంగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లా వార్తలు

ఆన్‌లైన్ వస్తే మరింత మేలు

- ఇల్లెందులో 'డిజిటల్ లైబ్రరీ' కోసం ఎదురుచూపులు
- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- ఆన్‌లైన్ సదుపాయం లేక ఉన్న పుస్తకాలతోనే ప్రిపరేషన్




ఇల్లెందు లైబ్రరీ నూతన భవనం



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు



ప్రత్యేక రీడింగ్ చైర్‌లో చదువుకుంటూ...



గ్రంథాలయంలోని పుస్తకాలు

ఇల్లెందు: ఏళ్ల తర్వాత ఇల్లెందులో సువిశాలమైన గ్రంథాలయ భవనం అందుబాటులోకి వచ్చింది. ఈ భవన నిర్మాణానికి 2023లో నాటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, అప్పటి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శంకుస్థాపన చేయగా, గత నెల 22న ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. రూ.కోటి వ్యయంతో నిర్మించిన ఈ భవనం అందుబాటులోకి రావడంపై నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నా ఆన్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, చర్ల, ఇల్లెందులో గ్రంథాలయాలకు విశాలమైన భవనాలు అందుబాటులో ఉండగా, పాల్వంచలో డిజిటల్ గ్రంథాలయం కూడా నెలకొల్పారు. ఇల్లెందులో కూడా ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఇరుకు సందులో పాత భవనం

ఇల్లెందు గోవింద్ సెంటర్‌లోని ఇరుకు సందులో పురాతన భవనంలో గ్రంథాలయం కొనసాగేది. పట్టుమని పది మంది వచ్చినా కూర్చునేందుకు సదుపాయం లేకుండానే నిరవహించారు. ఆ తర్వాత జేకేకాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నూతన భవనం ఇటీవల అందుబాటులోకి వచ్చింది. ఇందులో విశాలమైన రీడింగ్ హాల్, వేలాది పుస్తకాలు, ఎంతసేపు కూర్చున్నా ఇబ్బంది ఎదురుకాని తరహాలో నాణ్యమైన కుర్చీలను సమకూర్చారు. ఇందులో రీడింగ్ హాల్, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా ఉండగా ఏకకాలంలో 150 మంది వరకు చదువుకోవచ్చు.

డిజిటల్ కోసం ఎదురుచూపులు

అత్యాధునిక వసతులతో గ్రంథాలయ భవనం అందుబాటులోకి తీసుకొచ్చిన యంత్రాంగం డిజిటల్ సౌకర్యం మాత్రం కల్పించలేదు. ఐదు నుంచి 10 కంప్యూటర్లు, వైఫై సదుపాయం కల్పిస్తే ఆన్‌లైన్‌లో పోటీ పరీక్షల సమాచారం తెలుసుకుని జర్నల్స్ చదువుకునే వెసలుబాటు కలుగుతుందని నిరద్యోగులు చెబుతున్నారు. రూ.వేలల్లో వెచ్చించి దూర ప్రాంతాల్లో శిక్షణ తీసుకునే పరిస్థితి లేని తమలాంటి వారి కోసం ఇక్కడ ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నిధులు లేక డీలా..

గ్రంథాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదు. మొక్కుబడిగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తద్వారా ఆశించినంత మేర ఆదాయం లేక తాగునీరు, విద్యుత్, పేపర్ బిల్లుల చెల్లింపునకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు చెల్లించే పన్నుల్లో 10 శాతం లోపు గ్రంథాలయాలకు సెస్ ఇవ్వాల్సి ఉంది. ఆ నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడం గమనార్హం.

డిజిటల్ విభాగం ఉంటే మేలు..



లైబ్రరీలో డిజిటల్ విభాగం కూడా నెలకొల్పితే మేలు జరుగుతుంది. దూరప్రాంతాల్లో శిక్షణకు వెళ్లలేని మాలాంటి వారికి ఆన్‌లైన్ అందుబాటులోకి వస్తుంది. అంతేకాక ఎక్కువ సమయం తెరిచే ఉంచడంపై దృష్టి సారించాలి.

–శ్రీను, ఇల్లెందు

ప్రత్యేక చొరవ చూపాలి..



గ్రంథాలయంలో డిజిటల్ విభాగం ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరం. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్‌తో పాటు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ చూపితే నిరుద్యోగులకు మేలు చేసిన వారవుతారు.

–కాళంగి హరికృష్ణ, ఇల్లెందు

ఒకేసారి 150మంది చదువుకోవచ్చు



లైబ్రరీని నిరుద్యోగుల కోసం అధిక సమయం తెరిచి కొనసాగిస్తున్నాం. డిజిటల్ విభాగం కూడా ఏర్పాటైతే వారికి మరింత ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. గ్రంథాలయంలో 150 మంది ఏకకాలంలో చదువుకునే అవకాశం ఉంది.

–రుక్మిణి, లైబ్రేరియన్

సోలార్ అండగా.. చెరుకు రసం దండిగ!

రోజురోజుకూ సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన పెరుగుతుండటంతో ఇళ్ల యజమానులతో పాటు చిరువ్యాపారులు సైతం అందిపుచ్చుకుంటున్నారు. ఇందులో భాగంగా పాల్వంచ క్రాస్ రోడ్డులో చెరుకు రసం అమ్మే చిరు వ్యాపారి తన వాహనానికి సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఉత్పత్తి అయ్యే విద్యుత్ ద్వారా వాహనంలోని యంత్రాన్ని నడిపిస్తూ చెరుకు రసం తీసి విక్రయిస్తున్నాడు. ఒకసారి సోలార్ ప్లేట్లు బిగించుకుంటే చాన్నాళ్లు ఇబ్బంది లేకుండా కొనసాగుతుందని.. తద్వారా బ్యాటరీల ఖర్చు వంటివి తగ్గుతాయని సదరు వ్యాపారి వెల్లడించాడు. – పాల్వంచ





సోలార్ ప్లేట్లు అమర్చిన వాహనం ద్వారా చెరుకు రసం అమ్ముతున్న వ్యాపారి (ఇన్‌సెట్) వాహనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు

వరద తగ్గింది.. వారధి తేలింది



నీరు తగ్గడంతో బయటపడిన ఆనకట్ట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాల మధ్య వారధిలా పనిచేస్తోంది. ఆనకట్ట పైనుంచి వర్షాకాలం మొదలు కొద్దిరోజుల కిందటి వరకు నీరు ప్రవహించింది. దీంతో జలపాతం మాదిరి కనిపించగా ఇప్పుడు గోదావరి నీటిమట్టం తగ్గడంతో ఆనకట్ట బయటపడి వారధిలా పనిచేస్తోంది. ఏటా ఈ ఆనకట్ట వేసవిలో వారధిలా, శీతాకాలంలో జలపాతంలా, వర్షాకాలంలో నీరు ఉప్పొంగుతూ కొత్త అందాలు సంతరించుకుంటుంది. అయితే, ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. – అశ్వాపురం

సీపీఆర్ఎంఎస్‌లో చేరడానికి మరో అవకాశం

- మార్చి 31లోగా నగదు చెల్లిస్తే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యసేవలు
- రూ.60 వేలు కడితే రూ.8 లక్షల విలువైన చికిత్స



సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు పరిశ్రమల్లో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కోలిండియా కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్ – నాన్ ఎగ్జిక్యూటివ్ (సీపీఆర్ఎంఎస్ – ఎన్ఈ)ను అమలు చేస్తోంది. ఇందులో చేరేందుకు గడువును మార్చి 31వరకు పొడిగించారు. ఈ విషయమై కోలిండియా తీసుకున్న నిర్ణయం మేరకు సింగరేణి యాజమాన్యం గత జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.8 లక్షల విలువైన వైద్యం

బొగ్గు పరిశ్రమల్లో పనిచేసి రిటైర్డ్ కార్మికులకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించాల్సి ఉన్నప్పటికీ నగదు చెల్లించాల్సిందేనని యాజమాన్యాలు స్పష్టం చేయడంతో గతంలో చర్చలు జరిగాయి. ఈ క్రమంలోనే సీపీఆర్ఎంఎస్ – ఎన్ఈను 2019లో అమల్లోకి తీసుకొచ్చారు. తొలినాళ్లలో రూ.10 వేలు కడితే ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో చికిత్స అందేది. ఆ తర్వాత రూ.40 వేలకు పెంచి రూ.8 లక్షల విలువైన చికిత్స చేయించడానికి అంగీకారం కుదిరింది. అయితే, సకాలంలో చాలా మంది సభ్యులుగా చేరకపోవడంతో మరో రూ.20 వేలు పెంచి రూ.60 వేలు కట్టడానికి మార్చి 31 వరకు గడువు పొడిగించారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా..

బొగ్గుగనుల్లో పనిచేసే సమయాన కార్మికులు అనారోగ్యం బారిన పడితే ఏరియా, ప్రధానాస్పత్రుల్లో వైద్యసేవలు అందుతాయి. అయితే విరమణ అయ్యాక వీరికి ఉచితంగా వైద్యసేవలు ఇవ్వలేమని చెబుతూ సీపీఆర్ఎంఎస్ కార్డ్‌ను ప్రవేశపెట్టారు. ఏటా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి.. దీనిని రెన్యూవల్ చేసుకుంటే సుమారు 156 ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించేలా నిర్ణయించారు. కాగా, హైదరాబాద్‌తో పాటు వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈ కార్డ్ చూపిస్తే ఎలాంటి షరతులు లేకుండా వైద్యసేవలు అందిస్తారని సింగరేణి యాజమాన్యం చెబుతోంది. ఇందుకోసం సింగరేణి భవన్‌లో ప్రత్యేకాధికారిని సైతం నియమించారు. కానీ, కొన్ని ఆస్పత్రులు మెరుగైన సేవలందిస్తుండగా.. మరికొన్ని చోట్ల మాత్రం నామమాత్రపు సేవలు అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

సీపీఆర్ఎంఎస్‌లో చేరేందుకు మూడు సెట్ల దరఖాస్తులు, రిటైర్డ్ ఉద్యోగి, భార్య, నామినీవి ఐదు చొప్పున ఫొటోలు, ముగ్గురివి మూడేసి ఆధార్ కార్డు కాపీలతో పాటు కంపెనీలో తొలగించిన నాటి లేఖ, బ్యాంకు ఖాతా పుస్తకం కలర్ జిరాక్స్ మూడు సెట్లు సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాక చివరి నెల వేతనం జిరాక్స్, రిటైర్డ్ ఉద్యోగి దంపతుల పాన్ కార్డులు కూడా జత చేయాలి. ఒకవేళ దివ్యాంగులైన పిల్లలు ఉంటే మరో రూ.20 వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుతం ఏరియా వారీగా పరిశీలిస్తే ఇప్పటి వరకు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో 1,642 మంది, కొత్తగూడెం ఏరియాలో 2,761, మణుగూరు ఏరియాలో 2,248, ఇల్లెందు ఏరియాలో 1,369 మంది రిటైర్డ్ ఉద్యోగులు కార్డుల కోసం నగదు చెల్లించారు.